



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

గురువారం 12, జూన్, 2025




- నిద్రను నటిస్తున్న ఎక్సైజ్ శాఖ...?
- టాస్క్ ఫోర్స్ దాడుల్లోనే బయటపడుతున్న నల్లబెల్లం..?

## జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా

**కొత్తగూడెం క్రైమ్, సూర్య (మేజర్ న్యూస్)-** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుడుంబా అమ్మకాలు గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్నాయి. కొన్నాళ్లపాటు గుడుంబారహిత జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ప్రకటించుకున్నప్పటికీ మళ్లీ గుడుంబా అమ్మకాలు చాప కింద నీరులా సాగుతున్నాయి. ఇంత తతంగం నడుస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని రామాటాకీస్ ఏరియా, చిట్టి రామవరం, అశోక్ నగర్ తదితర ప్రాంతాలలో గుడుంబా విక్రయాలు సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా మారుమూల కుగ్రామాల్లో సైతం సారాబట్టీలు వెలుస్తున్నాయని తెలియవచ్చింది.




వివరాలు 2 లో..




## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### విత్తన, ఫెర్టిలైజర్- పెస్టిసైడ్స్ దుకాణాల్ని తనిఖీ చేసిన ఏ డి ఏ విజయ చంద్ర



**మధిర, సూర్య మేజర్ న్యూస్ :** మధిర మండల పరిధిలో ఫెర్టిలైజర్ పెస్టిసైడ్స్ విత్తనాల విక్రయించే షాపులలో ఏ డి ఏ విజయ్ చంద్ర బుధవారం తనిఖీలు నిర్వహించి స్టాక్ సేల్స్ రిజిస్టర్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ విజయచంద్ర మాట్లాడుతూ లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలుచేయాలని, అనుమతి లేని విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత రసాయనాలు అమ్మకాలు జరిపితే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని,నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు, విత్తన అధీకృత డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని ఆయన సూచించారు. 2వ పేజీలో...



- ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాలు
- కల్లూరు మండలంలో మూతబడిన మూడు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనుల కోసం రూ 10 లక్షలు మంజూరు
- బడిబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలంలో మూతపడిన పాఠశాలను పునః ప్రారంభించిన జిల్లా కలెక్టర్

## ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం..

### నమ్మకం ఉంచి పిల్లలను పంపాలి.... జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**కల్లూరు సూర్య రూరల్ న్యూస్ జూన్ 11 :** మండల పరిది ఓబులారావు బంజరు గ్రామంలో బుదవారం ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి పిల్లలను పంపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలంలోని ఓబుల్ రావు బంజర గ్రామంలో గతంలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను గ్రామ ప్రజలు, తల్లిదండ్రుల సమక్షంలో పండుగ వాతావరణంలో బడి పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ పునః ప్రారంభించారు.



## మావోయిస్టులు జంగిల్‌ను వీడి జనంలోకి రావాలి



**చర్ల, సూర్య (మేజర్ న్యూస్)-** మారుమూల గ్రామాల ఆదివాసీలు ధాన్యం మిల్లు పట్టించడానికి మైళ్ళ దూరం వెళ్లవల్సిన అగత్యం లేదు. పోలీస్ శాఖ సహకారంతో ఆ ఇబ్బందులు దూరమయ్యాయి.. ఆదివాసీలను అభివృద్ధి పథంలోకి నడిపేందుకు పోలీస్ శాఖ వారికి అండగా ఉంటుందని భద్రాద్రి జిల్లా పోలీస్ బాస్ ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామమైన రాళ్లాపురం ప్రజల సౌకర్యార్థం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన మినీ రైస్ మిల్ బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు.

2లో

- మిల్లు కోసం మైళ్ళ దూరం వెళ్లక్కర్లే!
- పోలీస్ శాఖ అండతో ఇబ్బందులు బంద్
- ఆదివాసి గ్రామాలకు మినీ రైస్ మిల్లులు
- మారుమూల ఆదివాసులకు అండగా పోలీసులు
- రూ 50 లక్షల వ్యయంతో 20 మినీ మిల్లులు

# జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా

మొదటి పేజీ తరువాయి

ఇంత జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు మాత్రం వాటిని అరికట్టడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. గుడుంబా నియంత్రణలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది చూపిస్తున్న తెగువ, చొరవ వల్లే గుడుంబా విక్రయదారుల అరెస్టులపర్వం కొనసాగుతోందని తెలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మేదరబస్తీలో మంగళవారం 1.92 క్వింటాళ్ల నల్లబెల్లం, 5 కేజీల పటిక ఒక ఇంట్లో ఉందనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మేదరబస్తీలో నివాసం ఉండే దివాకర్ రాజు నాటు సారా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం, పట్టికను బహిరంగంగా విక్రయిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులకు మాత్రం సమాచారం లేకపోవడం కొంత విడ్డూరంగా ఉంది. నల్ల బెల్లం పట్టిక అక్రమంగా ఒక ఇంట్లో ఉందని సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ అధికారులు అతని ఇంట్లో నిల్వ ఉన్న 1.92 నల్లబెల్లం, ఐదు కేజీల పట్టికను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. అయితే గతంలో కూడా పెద్ద బజార్లో వ్యాపార లావాదేవీలు నిర్వహించే ఒక వ్యక్తి ఏచర్ వాన్ లో నల్ల బెల్లాన్ని తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ అధికారులు రేగళ్ల ప్రాంతంలో వలపన్ని పట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న గుడుంబా విక్రయాలపై టాస్క్ ఫోర్స్ అధికారులకు ఉన్న సమాచారం ఎక్సైజ్ పోలీసులకు లేకపోవడం మాత్రం కొంత అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా ఎక్సైజ్ అధికారులు నాటు సారా బట్టీలు, నల్లబెల్లం, పట్టిక అమ్మకాలు జరిపే వారిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది తమ పని కాదన్నట్లు కేవలం టాస్క్ ఫోర్స్ అధికారుల పని మాత్రమే అన్నట్లుగా చూసి చూడనట్లుగా కొందరు ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. గుడుంబాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయో...? గత అనుభవాలు చెప్పకనే చెబుతున్నాయి. మళ్లీ జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే గుడుంబా నియంత్రణను అందరి బాధ్యతగా తీసుకొని ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఇకనైనా ఎక్సైజ్ అధికారులు ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తారో...? లేదో...? వేచి చూడాల్సిందే.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మొదటి పేజీ తరువాయి

విక్రయించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. దుకాణాల ఎదుట ధరల పట్టిక, ఎరువుల నిల్వలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా చట్టప్రకారం చర్యలు తప్పవని విజయ్ చంద్ర హెచ్చరించారు. ఎవరైనా లూస్ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం వస్తే అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ కి తెలియజేయమన్నారు బీటీ త్రీ విత్తనాలు వాడక నిషేధించడం జరిగింది అటువంటి విత్తనాలు ఎవరైనా వాడుతున్న అమ్ముతున్న అటువంటి వారిపై చర్య తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధిర అగ్రికల్చర్ ఆఫీసర్ సాయి దీక్షిత్ పాల్గొన్నారు.

# రైతులకు మ్యానువల్ పహాణి ఇచ్చిబ్యాంకు లోన్స్ కల్పించాలి

## సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వాంకుడోత్ కొబల్




**లక్ష్మీదేవిపల్లి, సూర్య (మేజర్న్యూస్)** – సిపిఎం పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల కమిటీ సమావేశం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వాంకుడోత్ కొబల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మాట్లాడుతూ మండలాల్లో ఉన్న భూ సమస్యలు తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతిలో అనుభవదారులుగా ఉన్న ప్రతి రైతులకు ఇటువంటి డాక్యుమెంటు లేకుండా ఉన్న వాళ్లకు కూడా పట్టా ఇవ్వాల్సిందిగా సిపిఎం పార్టీ డిమాండ్ చేసారు. అట్లాగే అంబ సత్రం భూమి అనుభవదారులుగా లో ఉన్న రైతులకు మ్యానువల్ పహాణి ఇచ్చి వాళ్ళ కు బ్యాంకు లోన్స్ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకుడు అనవరపు సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఉన్న రైతులందరి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశానికి గిరిజన సంఘం జిల్లా నాయకుడు వాంకుడోత్ అమర్ సింగ్ ,ధారావత్ వెంకన్న బట్టు వెంకటేశ్వర్లు మేళ్ళ నాగేశ్వరావు, స్రవంతి, ఎల్ కుమార్ పాల్గొన్నారు.

# మావోయిస్టులు జంగిల్‌ను వీడి జనంలోకి రావాలి





మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన బుల్లెట్ వాహనంపై చర్ల నుండి రాళ్ళాపురం చేరుకున్నారు. రైస్ మిల్ ప్రారంభించిన తర్వాత జరిగిన సమావేశంలో ఆయన రాళ్ళాపురం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలు బాహ్య ప్రపంచంలోకి వచ్చి ఉద్యోగాలు చేస్తూ తమ గ్రామస్థులను చెతన్య పరచాలన్నారు. మారుమూల గ్రామాల నుండి ధాన్యాన్ని మండల కేంద్రంలో ఉన్న రైస్ మిల్లులకు తరలించడంలో ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు మారుమూలన ఉన్న 20 గ్రామాలకు ఒక్కొక్కటి రూ 2,లక్షల 50వేలు చొప్పున 20 మినీ రైస్ మిల్ లను మంజూరు చేసామని మొత్తం యూనిట్ల విలువ రూ 50,లక్షలు అని తెలిపారు. ఆదివాసీల ఇబ్బందిని తమ దృష్టికి తీసుకువచ్చి రాళ్ళాపురం గ్రామానికి మినీ రైస్ మిల్ మంజూరయ్యేందుకు చర్ల సీఐ రాజు వర్మ ఎంతో కృషి చేశారని తెలిపారు. మినీ మిల్ తో ధాన్యం, పిండి,కారం,రవ్వ ను పొందవచ్చని అన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిల్ కు ఏదైనా మరమ్మతులు వస్తే సంబంధించిన టెక్నీషియన్ తో మాత్రమే రిపేర్ చేయించుకోవాలని సూచించారు. ఆదివాసీ యువకులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరాలని మార్గ నిర్దేశం చేశారు. గ్రామస్తులతో ముచ్చటించి గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యమేనని ఏ ప్రయత్నమూ చేయకుండా ఉంటే భావి తరాలకు బంగారు భవిష్యత్తు ఇవ్వలేమన్నారు. ఒకప్పుడు మారుమూల గ్రామాలకు ప్రభుత్వ అధికారులు అడుగుపెట్టాలంటే కష్ట సాధ్యంగా ఉండేదని కానీ ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల వల్ల జిల్లా స్థాయి అధికారులు కూడా నేరుగా గ్రామాలలోకి వచ్చే పరిస్థితి నెలకొన్నదని అన్నారు. మార్పు కోసం ముందడుగు వేసిన ఆదివాసీలను అభినందించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో రహదారుల సౌకర్యం లేక గతంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పోలీస్ శాఖ కృషి వల్ల కొన్ని గ్రామాలకు గ్రావెల్ రోడ్లు నిర్మించడం వల్ల ఆయా గ్రామాల్లో ప్రజల కష్టాలు కొంతైనా తీరాయని తెలిపారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున ఆదివాసీ ప్రజలు జాగరుకతతో వ్యవహరించాలని, అనారోగ్యం వస్తే నాటు వైద్యం జోలికి పోకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. అనంతరం రాళ్ల పురం గ్రామానికి చెందిన సెయిలింగ్ క్రీడాకారుడు అడమయ్యను పోలీస్ శాఖ తరపున సన్మానించారు. ఆ యువకుడిని స్ఫూర్తిగా తీసుకొని గ్రామంలోని యువత చదువులో, క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, భద్రాచలం ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, ఎస్ బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్, సివిల్, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మావోయిస్టులు జంగిల్‌ను వీడి జనంలోకి రావాలి : ఎస్పీ రోహిత్ రాజు

మావోయిస్టులు జంగల్ ను వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులకు దూరంగా అడవిలో ఉండి సాధించేదేమీ లేదని లొంగిపోయి ప్రభుత్వం అందించే సౌకర్యాలను ఉపయోగించుకొని తమ పరివారంతో ఆనందంగా జీవించాలని కోరారు. రాళ్ళాపురం గ్రామం నుండి వెళ్లి మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నారు పోడియం లక్ష్మి కుటుంబాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. వారి యోగక్షేమాలను కనుక్కొని లక్ష్మిని దళం వీడి ప్రశాంతంగా జీవించేలా కుటుంబ సభ్యులు ఆమెకు చెప్పాలని సూచించారు. మావోయిస్టు లక్ష్మి కుటుంబ సభ్యులకు దుస్తులను అందజేశారు.

# ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం..





మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఇక్కడ విద్య అందిస్తున్నామని అన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం తమ బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. డబ్బులు చెల్లించినప్పటికీ ప్రైవేటు వ్యవస్థలో నాణ్యమైన విద్య లభించడం లేదని కలెక్టర్ తెలిపారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు దక్కాలని, దీనికి విద్య ఒకటే మార్గమని అన్నారు. ఖమ్మం జిల్లాలో 1500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో మూతబడిన పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన ఆంగ్ల భాష విద్య అందిస్తామని, దీని కోసం అవసరమైన శిక్షణ ఉపాధ్యాయు లకు అందించామని అన్నారు. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులలో ప్రహారీ గోడ, టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మన పూర్వీకులు మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, గొప్ప స్థాయికి ఎదిగారని తెలిపారు. గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 96 శాతం ఉత్తీర్ణత ఉంటే, ప్రైవేట్ పాఠశాలల్లో ఆ సంఖ్య కేవలం 91 శాతం అని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఫలితాలను ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్నాయని కలెక్టర్ గుర్తుచేశారు. మన దగ్గర నాణ్యమైన, అనుభవం కల్గిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఒక సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి పిల్లలను పంపాలని, వారిలో స్పష్టమైన మార్పు కనిపించని పక్షంలో మళ్ళీ ప్రైవేట్ కు పంపాలని, ఒకసారి ప్రభుత్వ పాఠశాలలకు అవకాశం కల్పించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కల్లూరు మండలంలో మూతబడి పునః ప్రారంభించుకున్న పాయాపూర్, లక్ష్మీపురం, ఓబుల్ రావు బంజారా పాఠశాలల రినోవేషన్ కోసం రూ,10 లక్షల రూపాయల చెక్కును కల్లూరు ఆర్డీవోకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిల్లలకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ ను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఎంత మంది విద్యార్థులు అంగన్వాడీ కి వస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. పోషక లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని, పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడి కేంద్రంలో ఉన్న పిల్లల ఎత్తు, బరువు, వయసుకు తగ్గట్టు ఉందో లేదో నిరంతరం చెక్ చేసుకోవాలని, అంగన్వాడీకి కావలసిన సౌకర్యాలకు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, ఎంపీడీఓ., ఎం.ఈ.ఓ. పి. నివేదిత, సి.డి.పి.ఓ. సి.హెచ్. నిర్మలా జ్యోతి, సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్ ఐ.వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమాయక ఆదివాసీలపై యుద్ధం ప్రకటించిన మోడీ, షా





**రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న కేంద్రం చర్యలని ఎండగట్టాలి**

**'ఆపరేషన్ కగార్'ముమ్మాటికీ రాజ్యాంగ ఉల్లంగనే**

**హత్యాకాండను నిలిపివేసి తక్షణమే శాంతి చర్చలు జరపాలి**

**వామపక్ష, విపక్షాల సదస్సులో నేతలు**

**కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్)**- మధ్యభారతంలోని అమాయక ఆదివాసీ గిరిజనులపై ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా యుద్ధం ప్రకటించి హత్యాకాండకు పాల్పడుతోందని, ఈ చర్యలను దేశ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని వామపక్ష, విపక్షాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం 'శేషగిరిభవన్'లో గౌని నాగేశ్వరరావు, కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన వామపక్ష, విపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, ఆదివాసీ చట్టాలను కేంద్రప్రభుత్వం ఉల్లంగించి 'ఆపరేషన్ కగార్'పేరుతో దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని, అమాయక ఆదివాసీ బిడ్డలను పొట్టనపెట్టుకుంటోందని ఆరోపించారు. దేశ రక్షణకోసం సరిహద్దుల్లో ఉండాల్సిన సైనికులను ప్రజలకోసం పోరాడుతున్న మావోఇస్టులపైకి ఉసిగొల్పుతూ హత్యలకు ప్రేరేపిస్తోందని విమర్శించారు. 2026 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని అమిత్ షా ప్రకటించడాన్ని దేశ ప్రజలు కోరుకోవడం లేదని, పేదరిక నిర్మూలన, పూర్తి స్థాయిలో విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బాధ్యతగా కేంద్ర పాలకులు ప్రకటిస్తే ప్రజలు స్వాగతిస్తారని అన్నారు. అటవీ ప్రాంతంలో ఖనిజ సంపదకు కాపలాదారులుగా ఉన్న గిరిజనులను, మావోయిస్టులను మట్టిబెట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ కగార్'కు కేంద్రం తెరలేపిందని ఆరోపించారు. తక్షణమే 'ఆపరేషన్ కగార్' పేరుతో జరుపుతున్న హత్యాకాండకు స్వస్తి చెప్పి శాంతి చర్చలను కేంద్రం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్,టిజెఎస్ జిల్లా నాయకులూ మల్లెల రామనాథం, మాస్ లైన్ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గౌస్ పాషా, బిఆర్ఎస్ జిల్లా నాయకులు అనుదీప్, బిఎస్పి జిల్లా నాయకులు కురుమళ్ల శంకర్, టిపిఎఫ్ జిల్లా నాయకులు ప్రశాంత్ మాట్లాడారు. ఈ సదస్సులో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, ఫహీమ్, కె ఉమర్, కల్తీ వెంకటేశ్వర్లు, సతీష్, గోపాల్ రావు, దేవదానం, భూక్యా రమేష్, కృష్ణయ్య, సంజీవ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు పని కల్పించాలి -బత్తుల వెంకటేశ్వర్లు



**బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్)** - ఉపదామి కూలీలకు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని మోతె గ్రామంలోని ఉపాధి హామీ పని ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ పనులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలకు పని కల్పించిన ఎడల నిత్యవసర వస్తువులు అందించాలన్నారు. అంతేకాకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి పనిని లేకుండా చేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. ఉపాధి కార్మికుల్ని వలస బాట పట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం కొంతమందికి పని కల్పించలేదని తెలిపారు. వారికి తక్షణమే ఉపాధి హామీ పని కల్పించాలన్నారు. ప్రభుత్వం అధికారులు పని ఎక్కడా చూపించే పరిస్థితి లేదు అని తెలియజేయడంతో ఉపాధి హామీ కూలీలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. సొంత భూమి ఉంటే మీ చేలో పని పెట్టుకోండి అని అధికారులు తెలియజేయడంతో ఎకరం రెండుకరాలు మూడు ఎకరాలు ఉన్న ఉపాధి కార్మికుల వారి చేలో పని పెట్టి వారి బంధువులు మాత్రమే పనిలోకి వెళుతున్నారని తెలియజేశారు. ఈ సంవత్సరం పనిచేసిన వారికి ఒక్క బిల్లు కూడా ఉపాధి కార్మికులకు ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడ నాగేశ్వరావు, వీణ శ్రీను, పుట్టి అచ్చయ్య, తోడేటి సత్యనారాయణ, వడ్లకొండ వెంకటేశ్వర్లు, గుమ్మడి మంగ, దుర్గమ్మ ,పున్నమ్మ, వెంకట నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్వాడి బాట



**ఆశ్వాపురం, సూర్య (మేజర్ న్యూస్)**- మండల పరిధిలో గల మల్లెల మడుగు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మ మాట, అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మల్లెల మడుగు 1 కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి 3 సంవత్సరాల పిల్లలను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి అంగన్వాడీ కేంద్రాలకు రావలసిందిగా ప్రోత్సహిస్తూ, అంగన్వాడి కేంద్రాల్లో చదువుకున్న వారికి సర్టిఫికెట్లు మంజూరు చేస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ధనలక్ష్మి,అంగన్వాడి టీచర్స్ ఆర్ అరుణ, నాగమణి, సాహితీ, రావమ్మా, దీప్తి, చిన్నారులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# హమాలీ కాలనీలో అమ్మ మాట, అంగన్వాడీ బాట



**లక్ష్మీదేవిపల్లి,సూర్య (మేజర్ న్యూస్)**- మండల పరిధిలోని హమాలీ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మ మాట, అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యుఓ, సిడిపిఓ పాల్గొని రెండున్నర సంవత్సరాల పిల్లలందరినీ అంగన్వాడీలో చేర్చాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మొదటి రోజు పిల్లలకు ఎగ్ బిర్యానీ చేసి డిడబ్ల్యు చేతుల మీదుగా పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న,సూపర్వైజర్ రమాదేవి, ఐసిపిఎస్ కళ్యాణి, స్కూల్ టీచర్ భద్రమ్మ, ఏ డబ్ల్యూ టీచర్ స్ పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల సిబ్బంది వేతనాలు చెల్లించాలి

మొదటి పేజీ తరువాయి

చాలీ చాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు సక్రమంగా చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అవుతుందని అన్నారు. ప్రభుత్వం మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి గత 2 నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు ప్రతి నెల క్రమంగా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలి



**లక్ష్మీదేవిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)**- ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని బిజెపి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం సీతారాంపురంలో తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా గాంధీ నాయక్ బిజెపి కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గాంధీ నాయక్ మాట్లాడుతూ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ తమ తల్లితోపాటు ఒక మొక్క నాటి దేశంలో వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాదావత్ వినోద్ కుమార్, తారా సింగ్, లక్ష్మణ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులను సన్మానించిన కూనంనేని



**కొత్తగూడెంఅర్బన్,సూర్య (మేజర్ న్యూస్)**- కొత్తగూడెంకు చెందిన సీనియర్ న్యాయవాదులు ఎలమోలు ఉదయ భాస్కర రావు, రమేష్ కుమార్ మక్కడ్ లను కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అభిమానుల హర్ష ధ్వానాల మధ్య కృతజ్ఞతపూర్వకంగా శాలువాతో సత్కరించారు. తన ఎన్నికను రద్దు చేయాలని తెలంగాణ హై కోర్టులో వేసిన కేసు పరిష్కారం కోసం తమ అమూల్యమైన సమయాన్ని కేటాయించి, తమ అనుభవాన్ని రంగరించి, స్వచ్చందంగా పనిచేసి, సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్ గార్కి సహకరించిన కొత్తగూడెంకు చెందిన సీనియర్ న్యాయవాదులు ఎలమోలు ఉదయ భాస్కర రావు, రమేష్ కుమార్ మక్కడ్‌లకు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ సందర్బంగా కూనంనేని ప్రసంగిస్తూ తన ఎన్నికను సవాలు చేస్తూ హైకోర్టులో వేసిన కేసు గెలిపించుటకు కృషి చేసిన సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్, ఆయన కుమారుడు ప్రసేన్, వారికి సహకరించిన హైకోర్టు సీనియర్ న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్ లకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా, జిల్లా కౌన్సిల్ సభ్యులు, న్యాయవాది మునిగడప వెంకటేశ్వర్లు, కార్మిక నాయకులు వంగ వెంకట్, వత్తికొండ మల్లికార్జున రావు, రామవరం సిపిఐ నాయకులు షేక్ ఫహీం, గుత్తుల శ్రీను, ఖయ్యూమ్, దాసరి అశోక్, ఇంకా అనేక మంది అభిమానులు పాల్గొన్నారు.

# పాలన చేతకాక గత ప్రభుత్వంపై నిందలా ?

**కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు మానుకోవాలి**

**రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్ దే**

**మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి**



**కొత్తగూడెం అర్బన్, సూర్య (మేజర్ న్యూస్)** - కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక, గత ప్రభుత్వంపై నిందలు మోపడం అలవాటుగా చేసుకున్నారని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి విమర్శించారు. కాళేశ్వరంపై ప్రాజెక్టుపై తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ను పీసీ ఘోష్ కమిషన్ విచారించిన నేపథ్యంలో బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేసారు. కాళేశ్వరంపై పిచ్చికూతలు మాని ప్రాజెక్టు గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మొత్తం 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్,141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టిఎంసీల నీటి వినియోగం ఉందని తెలియజేశారు. తెలంగాణ ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు జీవనధార అని అన్నారు. పడావుపడ్డ తెలంగాణ భూములను మాజీ సీఎం కేసీఆర్ సస్యశ్యామలం చేసారని గుర్తు చేసారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ద్వారా సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, హరితహారం ద్వారా చెట్లను పెంచి రాష్ట్రాన్ని హరితవనంగా మార్చిన మహోన్నత దీక్ష దక్షుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని దుయ్యబట్టారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని చెప్పి, ఒక్క ఫ్రీ బస్ ఇచ్చి ఇటీవల ఆర్టీసీ చార్జీలను విపరీతంగా పెంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను తెలంగాణ ప్రజలు గ్రహించారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

# దిశ సమావేశం వాయిదా

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య (మేజర్ న్యూస్)– నేడు ఐడిఓసి కార్యాలయంలో జరుగనున్న దిశా కమిటీ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి నిర్వహించనున్న కమిటీ సమావేశం తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కావున జిల్లాకు చెందిన పార్లమెంట్, శాసనమండలి, శాసనసభ్యులు, ఎంపీపీలు, దిశా కమిటీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు కమిటీ సమావేశం వాయిదా పడిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

# సిపిఐ పాల్వంచ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**మండల కార్యదర్శిగా తిరిగి ఎన్నికైన వీసంశెట్టి పూర్ణచందర్రావు**

**సహాయ కార్యదర్శిగా తిరిగి ఎన్నికైన గుండాల నాగరాజు**

**91మందితో నూతన మండల సమితి ఏర్పాటు**





పాల్వంచ, సూర్య (మేజర్ న్యూస్)– సిపిఐ పాల్వంచ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల పరిధిలోని పాండురంగాపురం లో జరిగిన సిపిఐ పాల్వంచ మండల 19వ మహాసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై చర్చించి డిమాండ్ల సాధనకు తీర్మానాలు చేశారు. అనంతరం నూతనంగా 91మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వీసంశెట్టి పూర్ణచంద్రావు, సహాయ కార్యదర్శిగా గుండాల నాగరాజు లు తిరిగి ఎన్నిక అయ్యారు. వారితో పాటు 39 మందితో కార్యవర్గం, 91 మందితో కౌన్సిల్ సభ్యులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఈ నెల 28,29,30 తేదీల్లో సాంస్కృతిక ఉత్సవాలు



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)– పాకాల పాటి కృష్ణయ్య సంస్కృతిక కళా పీఠం మరియు తెలంగాణ పాల్వంచ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28, 29, 30 స్థానిక సీతారామ కళ్యాణ మండపం కేటీపీఎస్ లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా పాల్వంచ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ వ్యవస్థాపకులు పాకాలపాటి రోశయ్య చౌదరి,నిర్వాహక కమిటీ గౌరవాధ్యక్షులు యాసమునేని (వై .వి )వెంకటేశ్వర్లు , కన్వీనర్ కొండంవెంకన్న గౌడ్ కార్యక్రమం వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాపర్తి వెంకటాచారి, వాసుమల్ల సుందర్రావు డిష్ నాగేశ్వరరావు డప్పు రాము, ఎస్ కె భాషా, నూతక్కి గాంధీ ,మూడ్ లక్ష్మణ్ వానపాకుల రాంబాబు, ఎస్కే కాసిం,తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ మిత్ర వర్కర్స్‌కు శిక్షణ



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)– విద్యా శాఖ ఆదేశాల ప్రకారం పట్టణ, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వచ్ఛ మిత్ర (స్కావెంజర్స్ ) వర్కర్ లకు బుధవారం పాల్వంచలోని బొల్లోరిగూడెం హై స్కూల్ లో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న దృశ్య ఆయా పాఠశాలల్లో పనిచేసే స్వచ్ఛ మిత్ర సభ్యులు నిర్వహించాల్సిన పనులపై ఈ శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మరుగుదొడ్ల, పరిశుభ్రత, కిచెన్ గార్డెన్ పెంపకం, జిల్లా కలెక్టర్ సూచించిన వివిధ ఔషధ మొక్కలు పెంపకం చేపట్టాలని సూచించారు. పాఠశాల పరిశుభ్రత విషయం లో ఎక్కడ రాజీ పడకుండా బాధ్యత యుతంగా భావించి పాఠశాలలో మంచి ఆహ్లాద వాతావరణం లో విద్యాభ్యాసం కొనసాగటం లో స్వచ్ఛ మిత్రుల పాత్ర ఎక్కువ అని అన్నారు. ప్రధానోపాధ్యాయుల సూచనలు పాటిస్తూ పాఠశాలను ఆదర్శ వంతంగా, నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ నోడల్ ఆఫీసర్, ప్రకాష్ రావు, ఆర్ పి శ్రీనివాస్, రమేష్, రాంబాబు, ఎంఐఎస్ శ్రావణి, పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా ఐఎన్ టీయూసి







**ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి**

**సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్**

**పివికే 5 ఇంక్లైన్ లో ఐఎన్‌టీయూసి గేట్ మీటింగ్**

కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్) – కార్మికులకు ఏ సమస్య వచ్చిన ఐఎన్‌టీయూసి యూనియన్ అండగా ఉంటుందని, ఆ సమస్య పరిష్కారమే ధ్యేయంగా తమ యూనియన్ పనిచేస్తుందని ఐఎన్ టీయూసి సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ పేర్కొన్నారు.బుధవారం పీవీకే 5 ఇంక్లైన్‌లో ఐఎన్‌టీయూసి పిట్ సెక్రటరీ చిలక రాజయ్య అధ్యక్షతన గేట్ మీటింగ్ గని ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐఎన్ టీయూసి సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ హాజరైయ్యారు. ఈ సమావేశం లో వక్తలు మాట్లాడుతూ కార్మికులు ఆశీర్వదించి ఐఎన్‌టీయూసిని ఆరు ఏరియాలలో గెలిపించారన్నారు. ప్రాతినిధ్య సంఘంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సహాయ సహకారంతో అనేక కార్మిక హక్కులను సాధించామన్నారు. కొత్తగూడెం ఏరియాలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా అబ్బెంటిజం కౌన్సిలింగ్‌కు హాజరై వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న అనేక మంది కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని మెడికల్ బోర్డుకు రెఫర్ చేసి అన్‌ఫిట్ అయేవిధంగా యాజమాన్యం చొరవ చూపాలని కోరారు. కార్మికుల సొంత ఇంటి కల, రూ 20 లక్షల వడ్డీలేని ఋణం, లాంటి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించే విధంగా తమ యూనియన్ కృషి చేస్తుందన్నారు. స్వతంత్రం పూర్వం ఐఎన్‌టీయూసి జాతీయ యూనియన్ ను దేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ చేతుల మీదుగా స్థాపించడం జరిగినదని తెలిపారు. ఐఎన్‌టీయూసి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి నాయకత్వంలో, సెక్రటరీ జనరల్ జానక్ ప్రసాద్ ఆధ్వర్యంలో అనేక సింగరేణి కార్మిక హక్కులను సాధించిన చరిత్ర ఐఎన్‌టీయూసి యూనియన్‌దని గుర్తు చేసారు. సింగరేణిలో పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసి విఫలం అయిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో భాగస్వామిగా సిపిఐ అనుబంధ సంఘంగా ఏఐటీయూసి తమతో కలసి వస్తే ఉమ్మడిగా కార్మిక సమస్యలు పరిష్కరిద్దామని హితవు పలికారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ బూటుక రాజేశ్వరావు, బ్రాంచ్ సెక్రటరీలు సైమన్, మెంగన అశోక్, సెంట్రల్ కమిటీ సభ్యులు సకినాల సమ్మయ్య, పోశం శ్రీను, మల్లారపు కొమరయ్య, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ కె గౌస్,కల్వల శ్రీనివాస్,గోపు కుమార్,సత్తార్ పాషా,వై శంకర్, వల్లలా సాంబమూర్తి, రామస్వామి, కొమ్ము సాంబయ్య,సాయి ప్రసాద్, శివ క్రిష్ణ, సీతారాం, ఘన్ శ్యామ్, వీరన్న,నవీన్, ఎన్ వెంకటేశ్వర్రావు, ప్రశాంత్, వినయ్, జె రవి, చిరంజీవి, మధుసూదన్, రమాకాంత్, కృష్ణమూర్తి, ప్రభాకర్,బాలు, ఎన్ శంకర్, హరియా, రామ్మోహరావు,అరుణ్, రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు






**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాచలం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఎస్పి**

భద్రాచలం,సూర్య (మేజర్ న్యూస్)– శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు భద్రాచలం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి. నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగరాజు,ఎస్సైలు స్వప్న, రామకృష్ణ, శ్యామ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే జారె

దమ్మపేట,సూర్య (మేజర్ న్యూస్)– తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ డెవలప్మెంట్ మంత్రి కొండా సురేఖని వారి ఛాంబర్లో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందుగర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో దేవాదాయ (ఎండోమెంట్) శాఖలో ఆలయాలు ధార్మిక సంస్థలు పరిరక్షణ వాటి అభివృద్ధి గురించి చర్చించారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యం కొరకు ఆక్సిజన్ పార్క్(ఎకో పార్క్) ఆహ్లాదాన్ని ఇచ్చే అర్బన్ పార్క్ త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేలా అశ్వారావుపేట మున్సిపాలిటీని పర్యాటక కేంద్రంగా మార్చాలని మంత్రిని కోరారు. అంతరం తెలంగాణ ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాని వారి ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఆశ్రమ గిరిజన హైస్కూల్ లను ఇంటర్మీడియట్ విద్యకి స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యకు అన్ని భౌతిక



మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ నాయక్ అదనత్కి వివరించారు.

# అడ్వాన్స్ ఆస్టియో ఆర్థరైటిస్ తో బాధపడుతున్న మహిళకు రోబోటిక్ ట్రైలేటరల్ మోకాలి మార్పిడి చికిత్స

– మహిళకు సరికొత్త జీవితాన్ని అందించిన యశోద హాస్పిటల్స్

–విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డాక్టర్ రవీష్

ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):




దీర్ఘకాలికంగా రెండు మోకాళ్లలో తీవ్రమైన ఆస్టియో ఆర్థరైటిస్ తో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన 63 ఏళ్ల మహిళ సత్యవతి జోనిబోయినాకు ద్విపార్శ్వ రోబోటిక్ టోటల్ ని రీప్లేస్మెంట్ విజయవంతంగా పూర్తి చేసినట్లు యశోద హాస్పిటల్స్ వారు గర్వంగా ప్రకటించారు.బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రవీష్ మాట్లాడుతూ,దీర్ఘకాలిక ద్విపార్శ్వ మోకాలి నొప్పి , కీళ్ల దృఢత్వం, నడవడానికి ఇబ్బంది వంటి సమస్యలతో శ సత్యవతి యశోద హాస్పిటల్ కు వచ్చారనీ, ఇది ఆమె రోజువారీ కార్యకలాపాలను గణనీయంగా ప్రభావితం చేసిందనీ,క్లినికల్ పరీక్షలు డయాగ్నస్టిక్ ఇమేజింగ్ రెండు మోకాళ్లలో అధునాతన ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు నిర్ధారించాయన్నారు.దీనితో ఆమెకు రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ అవసరమని డాక్టర్లు నిర్ధారించారు . ఈ ప్రక్రియను మే 10, 2025న చీఫ్ కన్సల్టెంట్ , ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని బృంద సభ్యులైన కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ట్రామా అండ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ రవీష్ అజ్మీరా అదునాతన స్మిత్ అండ్ నెఫ్యూ కోరి రోబోటిక్ సిస్టమ్ ను ఉపయోగించి నిర్వహించారు. ఉన్నతమైన మన్నిక , తక్కువ బరువు కలిగిన ఆక్సీనియం ప్రొస్థెసిస్ ఇంప్లాంట్లను ఈ సర్జరీలో ఉపయోగించారు . "రోబోటిక్ కీళ్ల మార్పిడి బోన్ కట్స్ అమరికలో గతంలో ఎన్నడూ లేనంత ఖచ్చితంగా చేయడానికి వీలవుతుంది , ఇది కీళ్ల జీవితకాలం రోగి జీవనశైలిని మెరుగుపరచడంలో కీలకం . సత్యవతి కేసు , ఆధునిక పద్ధతులు , ముందస్తు రోగ నిర్ధారణ ,నిపుణుల సంరక్షణతో కలిపితే , తిరిగి నడవడం జీవన నాణ్యతను అత్యుత్తమంగా ఎలా పునరుద్ధరించగలవో రుజువు చేస్తుంది" అని యశోద హాస్పిటల్స్ హిప్ మోకాలి రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని ఎం.ఎస్.ఎం.సి.హెచ్ (ఆర్థో, యూ.కే) బృంద సభ్యులైన కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ట్రామా అండ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ రవీష్ అజ్మీరా అన్నారు . సర్జరీ తర్వాత , పేషెంట్ కు క్వాడ్రిసెప్స్ హామ్ స్ట్రింగ్ బలోపేతం , మోకాలి రామ్ వ్యాయామాలు వాకర్ సహాయంతో నడిపించడం అంకితమైనన ఫిజియోథెరపీ లభించింది . వీటి వలన త్వరగా లేచి నడవడమే కాకుండా అత్యంత తక్కువ సమయంలోనే నొప్పి కూడా తగ్గడంతో ఆరోగ్యమైన స్థితిలో ఆమె డిశ్చార్జ్ చేయబడ్డారు . విజయవంతంగా నిర్వహించిన ఈ సర్జరీ ఆర్థోపెడిక్ విభాగంలో యశోద హాస్పిటల్స్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది . కీళ్ల రుగ్మతలతో బాధపడుతున్న పేషెంట్లకు రోబోటిక్ సర్జరీ , కంప్యూటర్ నావిగేషన్ వంటి అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుంది . యశోద హాస్పిటల్స్ గురించి గత 30 సంవత్సరాలుగా హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 4 బ్రాంచ్ లు ( సికింద్రాబాద్ , సోమాజిగూడ మలకపేట్ , హైటెక్ సిటీ ) 4 వేల పడకలు కలిగి ఉన్న అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య అవసరాలకు అనుగుణంగా అనుభవంతులైన వైద్యులచే , అధునాతన సాంకేతికతలతో ఇప్పుడు అందరికి చేరువలో కార్పొరేట్ వైద్య సేవలు . చురుకైన నాయకత్వం బలమైన నిర్వహణ వైద్య చికిత్సలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను అందించే అత్యుత్తమ కేంద్రంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అభివృద్ధి చెందింది . పేషంట్ అవసరాలకు అనుగుణంగా అనునిత్యం మార్గనిర్దేశం చేయబడుతుంది . అరుదైన సంక్లిష్టమైన విధానాలకు కూడా సంపూర్ణ మిళిత విప్లవాత్మక సాంకేతికత ద్వారా చికిత్సలను అందిస్తుంది . యశోద గ్రూప్ మెడిసిన్ సర్జరీకి సంబంధి సాంకేతికత ద్వారా చికిత్సలను అందిస్తుంది . యశోద గ్రూప్ మెడిసిన్ సర్జరీకి సంబంధించిన ప్రతి స్పెషాలిటీ సబ్ స్పెషాలిటీలో అధునాతన రోగనిర్ధారణ చికిత్సా సంరక్షణను అందించడం ద్వారా వైద్య నైపుణ్యం అధునాతన విధానాలను నిర్వహిస్తుంది . భారతదేశంలోనే అతిపెద్ద వైద్య సదుపాయాలలో ఒకటిగా భావిస్తున్న తెలంగాణలోని హైదరాబాద్ లో 4000 పడకల సామర్థ్యంతో 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. సరసమైన ఖర్చులతో యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుంది .

# వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించుకుందాం : నంబూరి

సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:



భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 11 సంవత్సరాల పరిపాలన సేవా సుపరిపాలన పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్నదని. సత్తుపల్లిలో గురువారం నాడు జే కన్వెన్షన్ హాల్లో నిర్వహించే వికసిత్ భారత్ 2047 మేధో మదన సదస్సుకు ముఖ్య అతిథిగా భారతీయ జనతాపార్టీ జాతీయ నాయకులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి పాల్గొంటారని. సత్తుపల్లి నియోజకవర్గంలోని డాక్టర్లు, లాయర్లు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలోచన విధానాలను పంచుకొని వికసిత్ భారత్ 2047లక్ష్యాన్ని సాధించుకోవడంలో అందరూ భాగస్వామ్యులు అవ్వాలని వికసిత్ భారత్ ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ శీలం పాపారావు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేష్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు మట్ట ప్రసాద్ నాగ స్వామి, ప్రభాకర్ రెడ్డి, మందా శివ, శివ పాలకొల్లు శ్రీను, సుధాకర్ గాయం నాగరాజు, కృష్ణయ్య, కార్తీక్ వెంకటరామిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిశుభ్రతపై స్వచ్ఛ మిత్ర' లకు శిక్షణ.

కామేపల్లి సూర్య మేజర్ న్యూస్

కామేపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోనే పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ఒకరోజు శిక్షణ కామేపల్లి మండల కేంద్రంలో రైతు వేదిక నందు ఏర్పాటు చేయడం జరిగినది .మండల విద్యాశాఖ అధికారి జి .వెంకట్ గారు శిక్షణ ప్రారంభించారు. భావి భారత పౌరులైన విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి అందరూ ఆరోగ్యంగా ఉండేటట్లు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరినారు శిక్షణలో నేర్చుకున్న తెలుసుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో కార్యరూపం దాల్చి అందరి ఆరోగ్యాలను కాపాడాలని సూచించారు .రిసోర్స్ పర్సన్ గా టి .వెంకన్న .ఎస్. సుజాత .టి విజిత వ్యవహరించారు. మండల పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు. మరియు బాలాజీ సీసీ ఓ శ్రీను మండల సిఆర్పిలు అందరూ పాల్గొన్నారు.



# కట్లేరు ప్రాజెక్టు ఎడమ కాలువ మరమ్మత్తులను పరిశీలిస్తున్న – మధిర ఏఎంసీ చైర్మన్ బండారు

ఎర్రుపాలెం. సూర్య మేజర్ న్యూస్



మండల పరిధిలోని మాము నూరు పరిధిలో కట్లేరు ప్రాజెక్టుకు ఎడమ కాలువకు ఇటీవల కురిసిన వర్షాలకు గండ్లు పడటంతో రైతులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు కావడంతో మరమ్మత్తుల పనులు బుధవారం ప్రారంభించారు. మరమ్మ త్తుల పనులను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు పరిశీలించారు.

# వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెంట్ 3వ నూతన కేంద్ర నిర్మాణ పనులు ప్రారంభం

ఖమ్మం (సూర్య బ్యూరో):





గుట్టల బజార్ ప్రాంతంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయం నందు వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ యొక్క నూతన కేంద్ర నిర్మాణ పనులు సంస్థ డైరెక్టర్ శ్రీ దేవకి వాసుదేవరావు ప్రారంభించారు . ఈ సందర్భంగా పూజా నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత 12 సంవత్సరాలుగా ఖమ్మంలో వేల మందికి శిక్షణ ఇచ్చినటువంటి వివేకా నంద ఇన్స్టిట్యూట్ , మూడో పట్టణ ప్రాంతంలో కూడా యువత మరి యు మహిళలకు ఈ శిక్షణ కేంద్రం ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు దేవకి వాసుదేవరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కేశవలాల్ పటేల్ , జయంతిలాల్ పటేల్ , చంద్రశేఖర్ , దేవకి రూపవతి , సంతోష్ , శ్రీనివాస్ చారి , రాముడు , బన్సీలాల్ , రాగిణి , కళ్యాణి మరియు రామకృష్ణ విద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన తోటకూర

కల్లూరు సూర్య రూరల్ న్యూస్ జూన్ 11 :



మండల పరిధి తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రామ సర్పంచ్ తోటకూర శేషగిరిరావు సత్తుపల్లి మహిళా శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ దంపతులకు టి పి సి సి జనరల్ సెక్రటరీగా ఎన్నిక పట్ల ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు బుధవారం ఆయన నివాస గృహ మైనటువంటి తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ దంపతులు జీవితంలో ఇటువంటి పదవులు ఎన్నో చేపట్టి సత్తుపల్లి నియోజకవర్గ ఓటర్లు ప్రతి ఒక్కరికి వీరి అండ దండలు ఉండాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ వార్డు సభ్యులు జొన్నలగడ్డ ప్రసాదు జొన్నలగడ్డ బాలరాజు మోదుగు మంగయ్య జెర్రిపోతుల కోటయ్య గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీలో కొనసాగుతున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్

### -పరిశుభ్రత,ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం:- కమిషనర్ చింతా వేణు

వైరా టౌన్ (సూర్య న్యూస్ ):- జూన్ 11



రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ 51 అంశాలు అమలు లో భాగంగా పరిశుభ్రత ప్రజారోగ్యమే లక్ష్యంగా ముందుకెళుతున్నామని స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ చింతా వేణు అన్నారు.బుధవారం పరిశుభ్రత లో భాగంగా మురుగు కాలువలు, పూడికతీత పనులు, డ్రైనేజీలు శుభ్రం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు,కాలేజీలు, హోటల్లు, డంపింగ్ యార్డ్ వంటి స్థలాల్లో జెసిబి సహాయంతో శుభ్రత కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు.

## బడి బాట ప్రచారం బైకు యాత్ర

కల్లూరు సూర్య రూరల్ న్యూస్ జూన్ 11 :



జిల్లావ్యాప్తంగా స్వచ్ఛంద బడిబాట ప్రచార బైక్ యాత్ర చేస్తున్న మండల పరిధి గ్రామానికి చెందిన చెన్నూరు ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు దంతాల సుధాకర్ ను ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ప్రత్యేకంగా అభినందించారు అనంతరం కలెక్టర్ మండల పరిధిలోని ఓబుల్ రావు బంజరు ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభించడానికి వచ్చిన కలెక్టర్ సుధాకర్ బడిబాట బైక్ వద్దకు వచ్చి మండలంలో విద్యార్థుల సంఖ్య పెంచుటకు స్వతహాగా ప్రచారం చేస్తున్న సుధాకర్ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు మండలంలోని కాకుండా జిల్లా వ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులు దంతాల సుధాకర్ ను చూసి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సుధాకర్ల ప్రచారం చేయాలని సుధాకర్ను ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డిఓ రాజేంద్ర ఎమ్మార్వో పులి సాంబశివుడు ఎంపీడీవో చంద్రశేఖర్ సిడిపిఓ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరదల సమయంలో అప్రమత్తత పై అవగాహన

### - తాసిల్దార్ రాంప్రసాద్

ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ :



భారీ వర్షాలు, వరదలు సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఖమ్మం రూరల్ మండలం తాసిల్దార్ వి.రాంప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని తీర్థాల గ్రామంలో వివిధ శాఖల అధికారుల గ్రామ ప్రజలతో రాష్ట్ర విపత్తుల నిర్మూలన స్పందన విభాగం ఎస్డిఆర్ఎఫ్ అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత హైదరాబాద్ నుంచి వచ్చి నటువంటి ఎస్డిఆర్ఎఫ్ బృందం సభ్యులు మున్నేరు పరివాహక ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు.సమీప ప్రాంతాల ప్రజలను కలుసుకొని గతంలో వరదలు వచ్చిన సమయంలో పరిణామాలపై ఆరా తీశారు. అనంతరం తీర్థాల గ్రామ ంలోని శివాలయం ఆవరణలో తాసిల్దార్ అధ్యక్షతను అవగాహన సదస్సు నిర్వహించారు.ముందుగా గతంలో మున్నేరు వరదలకు పడిన ఇబ్బందులు చోటు చేసుకున్న పరిణామాలను గ్రామస్తులు అధికారులకు వివరించారు. అనంతరం తాసిల్దార్,ఎస్ డి ఆర్ ఎఫ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జానయ్య అవగాహన కల్పించారు.

# పిల్లలను ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించండి

ఏన్కూర్ సూర్య మేజర్ న్యూస్ :





పిల్లలను ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం లో చేర్పించాలని సీనియర్ ఉపాధ్యాయులు టీం లీడర్ డిఎస్.నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు.ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. బడిబాట కార్యక్రమంలో భాగంగా మాల పోచారం ఉపాధ్యాయులు రెండు టీములుగా విడిపోయి ఏన్కూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాలను 8, 9, 10, 11 తారీఖులలో విస్తృతంగా పర్యటించి విద్యార్థుల నమోదుకు కృషి చేశారు.ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటూ విద్యార్థులను చేర్పించేలా తల్లిదండ్రులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా టీం లీడర్ డిఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు గురించి తెలియజేశారు.మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ మోజులో పడి ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలని వారు కోరారు.ఆశ్రమ పాఠశాలలో ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, లేబరేట రీలతో పాటు, ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతా వరణంలో ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతో, అనుభవజ్ఞులైన, నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందించబ డుతుందని, పిల్లల మానసిక ఆరోగ్యానికి వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ఆశ్రమ పాఠశాలలు రూపుది ద్దుకున్నాయని తెలియజేశారు .ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు,ట్రంక్ బాక్స్, నాలుగు జతల బట్టలు, షూస్, బెల్ట్, ఉదయం అల్పాహారం,రెండు పూటల భోజనం, వారానికి ఐదు అరటి పండ్లు, ఐదు కోడిగుడ్లు, నెలకు నాలుగు సార్లు చికెను, రెండుసార్లు మటన్ తో,సాయంత్రం స్నాక్స్, పౌష్టికమైన ఆహారాన్ని అందిస్తారని తెలియజేశారు.కావున విజ్ఞులైన తల్లిదండ్రులు ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో మీపిల్లలను చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని వారు పిలుపునిచ్చారు.బడిబాట కార్యక్రమంలో బి.శోభన్ నాయక్ కే.శ్యామల ఎం. చంద్రరావు, ఎన్.శ్రీరామ్, పి.శ్రీనివాస్,వి.రమేష్, బి.సింగ్య,జె.నాగేశ్వరరావు, బి.రవి,డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం రెవిన్యూ సదస్సు

### - పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:




తెలంగాణ భూ భారతి ( భూమి హక్కులు) చట్టం-2025 లో బాగం గా తుంబురు గ్రామం లో సత్తుపల్లి ఏం అర్ ఓ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ భూ భారతి నిర్వహించినారు. ఈ సదస్సు కు సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతం లో బి ఆర్ ఎస్ పార్టీ ధరణి పెట్టటం వలన నష్ట పోయిన, ఇబ్బందులు పడ్డ, రోడ్డు న పడ్డ కుటుంబాలు ఈ రాష్ట్ర%శీ% లో చూసాము అని బి ఆర్ ఎస్ పార్టీ పై మండిపడ్డారు. భూ సమస్యలు వున్న వారి నుండి దరఖాస్తు లు తీసుకొని, భూ భారతి చట్టం పై ప్రజలకు అవగాహనా సదస్సు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్నది అని భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం జరుగుతుంది అని అనేక పరిశోధన, విశ్లేషణ, మేధావుల సలహాలు ద్వారా ఈ తెలంగాణ భూ భారతి చట్టం తీసుకురావటం జరిగింది అని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటాము అని ప్రజలు కష్ట సుఖాల్లో తోడు, నీడగా ఉంటాము అని రాగమయి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు.సత్తుపల్లి ఏం అర్ ఓ, ప్రభుత్వ అధికారులు, సత్తుపల్లి మండల, తుంబురు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచాలి

### -ప్రతిభ చూపిన వారికి సన్మానాలు చేస్తాం

నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్




విద్యార్థుల ప్రవేశాల సంఖ్య ను పెంచాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు సూచించారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజనం వర్కర్స్, స్వచ్ఛ మిత్ర లకు బుధవారం అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ



పాఠశాల సంఖ్య ను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వ బడిని బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు సమిష్టి కృషి అవసరం ఉన్నారు. ఎక్కువగా విద్యార్థులను చేర్పించిన వారిని గుర్తించి సన్మానం చేస్తామని అన్నారు.మధ్యాహ్నం భోజనం లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా విద్యార్థులకు రుచికరమైన భోజనం ను అందించిన ఏజెన్సీ లకు,అదే విధంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచిన స్వచ్ఛ మిత లకు ఆగను 15 న ఘనంగా సన్మానం చేసామని అన్నారు. విధుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి ప్రభుత్వ పాఠశాలను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ సమావేశంలో సిఆర్పిలు ప్రసాద్ వెంకటేశ్వర్లు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మధ్యాహ్నం భోజనం వర్కర్స్,స్వీపర్స్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి ఆర్థిక చేయూతనందించిన యస్.బి.ఐ.టి.

ఖమ్మం (సూర్య బ్యూరో):
ప్రకృతి వైపరీత్యం వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన తమ కళాశాల విద్యార్థి షేక్ షరీఫ్ కు ఆర్థికంగా చేయూతను అందించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. గత సంవత్సరం ఖమ్మం ను ముంచెత్తిన వరదలలో కూసుమంచి మండలం పాలేరు నాయకనగూడెం వద్ద కళాశాల విద్యార్థి షరీఫ్ తల్లిదండ్రులైన షేక్ యాకూబ్ మరియు షేక్ సైదాబీ ఇద్దరూ మృతి చెందటంతో ఒంటరిగా మిగిలిన విద్యార్థి చదువులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా నేషనల్ ఇన్సూరెన్స్ ద్వారా 2 లక్షల రూపాయల చెక్కును బుధవారం కళాశాలలో విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఓదార్చి, కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలియజేశారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల ప్రమాదవశాత్తు తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు తమ కళాశాల అండగా ఉంటుందని, ఆర్థంత రంగా విద్యకు ఆటంకం కలగకూడదనే సదుద్దేశంతో ఈ పథకాన్ని అవలంభిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ధైర్యాన్ని



ఇవ్వడానికి ఇటువంటి ఆలోచన చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా.ఎ.వి.వి. శివ ప్రసాద్, డా. జె. రవీంద్రబాబు, డా. యన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## -అంగన్వాడి ఉపాధ్యాయురాలు.బి. కల్పన

నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్
మండల పరిధిలోని రాజేశ్వరపురం లో బుధవారం అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ను నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రుల తో సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి ఉపాధ్యాయురాలు.బి. కల్పన మాట్లాడుతూ...అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడేళ్ల దాటిన పిల్లలను గుర్తించి వారి ఇళ్ల ను సందర్శించి కేంద్రాలలో చేరాలని కోరుతున్నట్లు తెలిపారు. 5 ఏళ్ల దాటిన చిన్నారులను పాఠశాలలో చేర్పించనున్నట్లు పేర్కొన్నారు. గువ్వల గూడెం లో ఏసీడీపీవో రత్నకుమారి, సూపర్వైజర్ నాగమణి, టీచర్లు పుష్ప, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు



చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమే లక్ష్యంగా...

## -ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్:
ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రతి డివిజన్లో కొనసాగుతున్న పరిశుద్ధ నిర్వహణ తీరుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బారుగూడెం, పెద్ద తండా టీవీజీవోస్ కాలనీలో పర్యటించిన కమిషనర్ ఆయా కాలనీలో జరుగుతున్న పరిశుద్ధ



అనుకూలంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతిరోజు ఒకటి లేదా రెండు ప్రాంతాలకు ఎంపిక చేసి మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం కార్మికులను అక్కడే మోహరించి అవసరమైన చోట జెసిబి, దోజర్లు, ఇతర యంత్రాల ద్వారా కాలువలను శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. వానకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి వీధి శుభ్రంగా ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఏదోలా పురం మున్సిపాలిటీ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే తమ ప్రధాన ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలించి సిబ్బంది కార్మికులు సూచనలు చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల మూడవ తేదీ నుండి మున్సిపాలిటీ పరిధిలో వంద రోజులు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుద్ధ నిర్వాహన ఇతర విభాగాలకు సంబంధించి కార్యచరణ రూపొందించే క్షేత్రస్థాయిలో అందుకు

## కొనసాగుతున్న భూభారత రెవెన్యూ సదస్సులు

ఎర్రుపాలెం, సూర్య మేజర్ న్యూస్ :-
మండలంలో భూభారతి సర్వే బుధవారం భీమవరం, అయ్యవారిగూడెం గ్రామంలో.. నిర్వహించారు. భీమవరం 194 అయ్యగారు గూడెం 127 దరఖాస్తులు వచ్చినవి. నేడు మామునూరు, లక్ష్మీపురం గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు జరుగుతాయని తాసిల్దార్ ఉషా శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, రెవిన్యూ సిబ్బంది శిరీష, చందు, రైతులు పాల్గొన్నారు.



# మన హక్కులను మనమే కాపాడుకోవాలి- ఎమ్మెల్యే మట్టా

## – జై బాపు, జై భీమ్, జై సంవిదాన్" కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా దంపతులు.



సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:
సత్తుపల్లి పట్టణం కొమ్మేపల్లి కాలనీ లో" జై బాపు, జై భీమ్, జై సంవిదాన్" కార్యక్రమం లో బాగం గా కొమ్మేపల్లి కాలనీ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తో కలిసి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర లో సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే రాగమయి దయానంద్ , డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు .ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ , రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అందించిన స్వాతంత్ర, మానవ హక్కులు గురించి ప్రజలకు తెలియజేస్తూ రాజ్యాంగం ను, మన హక్కులను మనం కాపాడుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏ ఎమ్ సీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, కమల్ పాషా, కాంగ్రెస్ నాయకులు సుభాని, కొమ్మేపల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, సత్తుపల్లి పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, సత్తుపల్లిపట్టణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లలో మార్పు



వైరా టౌన్(సూర్య న్యూస్)జూన్ 11
వైరా విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని టౌన్, మండల విద్యుత్ శాఖ అధికారులకు సంబంధించిన ఫోన్ నెంబర్లు మారాయి. బుధవారం నుంచి కొత్త నెంబర్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మారిన నెంబర్లు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.
వైరా విద్యుత్ సబ్ స్టేషన్- 8712483906

వైరా టౌన్ సిబ్బంది వివరాలు

పి.సుందర్ కుమార్,ఏఈ టౌన్- 8712483904, కె.శ్రీనివాసరావు,లైన్ మన్- 8712483902, బి నెహ్రూ,అసిస్టెంట్ లైనమన్- 8919960241, పి.సీతయ్య,లైన్ ఇన్స్పెక్టర్ -8712483901, ఎల్.సేతురావు,ఫోర్మెన్ -7842241846

సోమవరం,గండుగ్లపాడు, స్టేజి పినపాక, కేజీ సిరిపురం, ముసలమడుగు,పుసలపాడు,స్నానాల లక్ష్మీ పురం సిబ్బంది వివరాలు.

పి.కృష్ణయ్య, లైన్ మాన్- 8712483903, బి.వీర భద్రం,అసిస్టెంట్ లైనమన్ -8897787696, విద్యుత్ సమస్యలు ఏమున్నా వినియోగదారులకు పైన తెలిపిన నెంబర్లు అందుబాటులో ఉన్నట్లు ఏఈ పి సుందర్ కుమార్ తెలిపారు.

# మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన శ్రీనివాసరెడ్డి



ఖమ్మం (సూర్య బ్యూరో):
పిసిసి జనరల్ సెక్రెటరీగా పదవి బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరెడ్డి బుధవారం టి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలను చైతన్యం చేసి పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ ను శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనను సెక్రటరీగా నియమానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత స్వచ్ఛ మిత్రులదే..

### -ఎంపీడీవో మహాలక్ష్మి...





**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)-**
పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత స్వచ్ఛ మిత్రులదేనని ఎంపీడీవో మహాలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల విద్యా వనరుల శాఖ అధికారి ఉండేటి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విద్యాశాఖ పక్షాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఎంపీడీవో, ఎర్రగుంట పిహెచ్సి వైద్యాధికారి ప్రియాంక పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిసరలు, తరగతి గదులు, మూత్రశాలలను పరిశుభ్రంగా స్వచ్ఛ మిత్రు లు( పాఠశాల పారిశుధ్య కార్మికులు) ఉంచుకో వాల న్నారు. స్వచ్ఛ మిత్రులకు ఆరోగ్య పరిశుభ్రత అంశాలపై వైద్యాధికారి అవగాహన కల్పిం చారు. అనంతరం మండల విద్యా వనరుల శాఖ అధికారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించాలని, పాఠశాలలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథులు ప్రభ ుత్వ నుంచి సరఫరా చేసిన స్కూల్ యూనిఫా ములను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం శంకర్ మహాదేవన్, ఐకెపి సీసీ నిర్మల, సిఆర్పి శిరీష, ఎర్ర గుంట కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు స్వచ్ఛమిత్రులు పాల్గొన్నారు.

## పాఠశాలలను శుభ్రం చేయాలి




**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**
పెనుబల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ మిత్ర సభ్యులకు పియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వి యం బంజర నందు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి యస్ సత్యనారాయణ మాట్లాడుతూ.. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయని స్వచ్ఛ మిత్ర సభ్యులు పాఠశాల తరగతి గదులు, పాఠశాల ఆవరణ, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎక్కడా నీరు నిల్వకుండా చూడాలని, పాఠశాల నందు చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్స్ ద్వారా బయటకు తరలించాల సూచించారు. అనారోగ్యానికి గురి కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ యన్ విహెచ్ ప్రసాద్, దీపిక పరికరాలను వినియోగించి శుభ్రం చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివి రామారావు, బండి రాము, సి ఆర్ పి లు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీమార్గం రాజా మార్గం - సీఐ అశోక్



**అశ్వాపురం సూర్య (మేజర్ న్యూస్)-**
రాజీమార్గం రాజా మార్గమని అశ్వాపురం సీఐ అశోక్ పేర్కొన్నారు. అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్, రాజికి అణువుగా ఉన్నటువంటి కేసులను పరిష్కరించుకోవడానికి జెఎఫ్ సిఎం కోర్టు మణుగూరు లో ఈనెల 14వ తేదీన లోక్ అదాలత్ జరుగుతుందని ఆయన తెలిపారు. కేసులు పెండింగ్ ఉన్నవారు రాజీమా ర్గం ద్వారా పరిష్కరించుకోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆయన తెలియజేశారు. తక్కువ ఫైన్ ఉన్నందున మణుగూరు కోర్టులో ఫైన్ చెల్లించి కేసులు రాజపడవచ్చని సిఐ అశోక్ తెలియజేశారు.

## ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయ దంపతులు



**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**
సత్తుపల్లి అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడు కే మురళి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టారం లో స్కూల్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న శ్రీమతి కనకదుర్గ తమ కుమార్తె దివిజ్ఞా ను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 9వ తరగతిలో చేర్పించి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. వీరి నిర్ణయం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



**వైరా టౌన్(సూర్య న్యూస్):-జూన్ 11**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని వైరా తహసీల్దార్ కే శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని విప్పలమడక,పాలడుగు గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్లు కే శ్రీనివాసరావు,సిహెచ్ సురేష్ బాబు లు మాట్లాడుతూ భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల రైతులకు భూ సమస్యలుంటే వెంటనే రెవిన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు గ్రామాల్లో కలిపి సుమారు 150 పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించిన గ్రామాల్లో ఇంకా ఎవరైనా దరఖాస్తు అందించిన వారు ఉంటే ఈనెల 18 వరకు మండల తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి సమర్పించవచ్చని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రసీదులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## అమ్మ మాట- అంగన్వాడి బాట...



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)-**
మండల పరిధిలోని రాజాపురం (నర్సాపురం) పంచాయతీ గ్రామంలో బుధవారం ఐసిడిఎస్- ఎర్రగుంట ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో గ్రామంలో అంగన్వాడీ బడికి చిన్నారులను స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడేళ్లకు పైబడిన చిన్నారులందరినీ అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కే విజయనిర్మల, జి పద్మావతి, బాణావత్ శ్రీదేవి, ఆయాలు రమణ, రాములమ్మ, పిల్లల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు, పాల్గొన్నారు.

## 13వ వార్డులో అమ్మ మాట..అంగన్వాడి బాట కార్యక్రమం



**ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)-**
స్థానిక ఆర్ అండ్ ఆర్ కాలనీ 13వ వార్డు 1,2,3 అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం బుధవారం విజయవంతంగా నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాల పరిది లోని పిల్లల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ రోహిణి నాయకత్వం వహించగా టీచర్లు విజయ్ కుమారి, మల్లికాంబ, సుజాత ఆయాలు షాహిన్, సుభద్ర పాల్గొన్నారు.

## విచారణకు వెళుతున్న కెసిఆర్ కు సంఘీభావం తెలిపిన లకావత్ గిరిబాబు

### -మాజీ మంత్రి పువ్వాడ,మాజీ ఎమ్మెల్యే రేగాలతో గిరిబాబు సమాలోచన



**జూలూరుపాడు ,సూర్య(మేజర్ న్యూస్)-**
కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోస్ ముందు హాజరయ్యేందుకు వెళుతున్న బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు సంఘీభావం తెలిపారు .హైదరాబాదులోని బిఆర్కే భవన్ కమిషన్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తో కలసి లకావత్ గిరిబాబు కెసిఆర్ కు మద్దతుగా నినాదాలు చేసారు. అనంతరం పువ్వాడ,రేగా,పార్టీఇతర ముఖ్య నాయకులతొ సమాలోచన చేసారు. గిరిబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కక్ష సాధింపు చర్య చేపడుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ అందులో భాగమేనని,కెసిఆర్ విచారణను ఎదుర్కొని కడిగిన ముత్యముల బయటకు వస్తారని గిరిబాబు ధీమ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలొ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు చావా వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, కర్షకుల, ప్రజా హక్కుల సాధనలో సిపిఐ పార్టీది కీలక పాత్ర

## -సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు

## – సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

**బోనకల్, సూర్య (మేజర్ న్యూస్):**

దేశంలో స్వాతంత్రానికి ముందు స్వాతంత్ర్య అనంతరం కార్మికులకు, కర్షకులకు, ప్రజలకు హక్కులు సాధించి పెట్టడంలో సిపిఐ తో పాటు ఇతర కమ్యూనిస్టు పార్టీలు కీలకపాత్ర పోషించాయని సిపిఐ జాతీయ సమితి భాగం హేమంతరావు కొనియాడారు. సిపిఐ బోనకల్ మండల మహాసభ అమరజీవి జక్కా నాగభూషణం ప్రాంగణం ముష్టికుంట్ల గ్రామంలో ఆకిన పవన్, ఏలూరి రమేష్ ల అధ్యక్షతన జరిగింది. ముందుగా మహాసభల ప్రారంభ సూచకంగా ఏర్పాటుచేసిన అరుణ పతాకాన్ని బత్తినేని నీరజ ఆవిష్కరించారు. అమరవీరుల స్మారక స్థూపానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి లు నివాళులర్పించారు. భాగం హేమంతరావు మాట్లాడుతూ వంద సంవత్సరాల కాలంలో సిపిఐ పార్టీ లేదా కమ్యూనిస్టు పార్టీలు దేశానికి ఏం చేశాయని కొంతమంది అవివేకులు కళ్ళున్నా చూడలేని కబోదులు మాట్లాడుతున్నారని ప్రస్తుత యువతకు కమ్యూనిస్టు పార్టీ తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశంలో స్వాతంత్రానికి ముందు అనంతరం ప్రజా హక్కుల సాధనలో వామపక్ష పార్టీలు కీలక పాత్ర పోషించడం వల్లనే జమీందారులు, జాకీర్దారులు, పటేల్ పట్వారి ల వ్యవస్థలు రద్దయిందన్నారు. ఆ వ్యవస్థ రద్దు వల్లనే ఎంతోమంది భూమిలేని కౌలు రైతులకు భూమి లభించిందన్నారు. కార్మికులందరూ కమ్యూనిస్టు పార్టీల అండతో ముఖ్యంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా 44 కార్మిక హక్కుల చట్టాలను సాధించుకున్నాయన్నారు. దేశంలోని ప్రజల హక్కులను, ఆస్తులను పరిరక్షించడానికి సిపిఐ చేసిన పోరాటం నేటి యువత తప్పక తెలుసుకోవాలన్నారు. పేద ప్రజలకు ఇల్లు కట్టించాలని మొదటిసారి అసెంబ్లీలో ప్రస్తావించింది కమ్యూనిస్టులేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. 2006 సంవత్సరంలో రైతుల రుణమాఫీ అమలు చేయాలని బ్యాంకులు ఎదుట సిపిఐ




ఆధ్వర్యంలో 48 గంటల పాటు ఆందోళన కార్యక్రమం చేస్తే అవహేళన చేశారని, రైతుల రుణాలు మాఫీ ఎలా చేస్తారని అప్పటి ప్రభుత్వ పెద్దలు ఎద్దేవా చేశారన్నారు. బడా పెట్టుబడిదారులకు రుణాల మాఫీ చేసినప్పుడు దేశానికి అన్నం పెట్టే రైతన్న బ్యాంకు రుణమాఫీ ఎందుకు చేయకూడదని ప్రశ్నించగా తోలుత 25 వేల రూపాయల రుణమాఫీ చేయటానికి అప్పటి ప్రభుత్వాలు ముందుకు వచ్చాయన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులకు ముష్టికుంట్ల నిలయంగా ఉందన్నారు. జక్కా నాగభూషణం కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. చెందించడంలో కీలక పాత్ర పోషించారని ఆయన కొనియాడారు. జక్కా నాగభూషణం నిస్వార్థమైన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, ఏనుగు వెంకటేశ్వరవు, బెజవాడ రవిబాబు, జిల్లా సమితి ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నాన్నబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదదర్శి జక్కుల రామారావు,ముష్టికుంట్ల గ్రామ శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను గుర్తించండి పాఠశాలల్లో నూరు శాతం చేర్పించండి

**–గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం, (సూర్య మేజర్ న్యూస్):**



బడి ఈడు బాలలందరూ బడిలోనే ఉండాలని బాల కార్మికులు గా ఎవరూ మిగిలిపోకూడదని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు జూన్ 12 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆయన బుధవారం తన చాంబర్లో ఆవిష్కరించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున బడి ఈడు పిల్లలందరినీ కూడా పాఠశాలలో చేర్పించాలని ఎవరు కూడా పని ప్రదేశంలో ఉండవద్దని బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు బడిబాట కార్యక్రమం ప్రారంభమైనందున ప్రజలు తల్లిదండ్రులు అధికారులు అందరూ కలిసి నూరు శాతం పాఠశాలలో నమోదు జరిగే విధంగా కృషిచేసి ఖమ్మం జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా రూపొందించడానికి కృషి చేయాలని తెలిపారు. బాలలు ఎక్కడెక్కడ పని ప్రదేశాలలో ఉన్నారో గుర్తించాలని ఒకవేళ తల్లిదండ్రులు పనిచేస్తున్నట్లయితే పిల్లలు ఎక్కువమంది ఆ పని ప్రదేశంలో ఉంటే విద్యాశాఖ ద్వారా అక్కడే వారి కోసం పాఠశాల ఏర్పాటు చేద్దామని అధికారులకు సూచించారు. జిల్లాలోని బడిఈడు బాలలందరూ తప్పనిసరిగా పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి మరియు శ్రీజ, బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ భారతరాణి జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి డిప్యూటీ లేబర్ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి జిల్లా బాలల పరిరక్షణ అధికారిని విష్ణువందన యాంటీ హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ బాధ్యులు ఉదయ్ భాస్కర్ ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ సభ్యులు రవీందర్ రాందాస్ రవిచంద్ర ఉమెన్ హబ్ బాధ్యులు సమ్రీన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.. నమ్మకం ఉంచి పిల్లలను పంపాలి....

**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**-ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాలు**

**-కల్లూరు మండలంలో మూతబడిన మూడు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనుల కోసం రూ 10 లక్షలు మంజూరు**

**-బడిబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలంలో మూతపడిన పాఠశాలను పునః ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**కల్లూరు సూర్య రూరల్ న్యూస్ జూన్ 11 :**







మండల పరిధి ఓబులారావు బంజరు గ్రామంలో బుదవారం ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి పిల్లలను పంపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలంలోని ఓబుల్ రావు బంజర గ్రామంలో గతంలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను గ్రామ ప్రజలు, తల్లిదండ్రుల సమక్షంలో పండుగ వాతావరణంలో బడి పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఇక్కడ విద్య అందిస్తున్నామని అన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం తమ బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. డబ్బులు చెల్లించినప్పటికీ ప్రైవేటు వ్యవస్థలో నాణ్యమైన విద్య లభించడం లేదని కలెక్టర్ తెలిపారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు దక్కాలని, దీనికి విద్య ఒకటే మార్గమని అన్నారు. ఖమ్మం జిల్లాలో 1500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో మూతబడిన పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన ఆంగ్ల భాష విద్య అందిస్తామని, దీని కోసం అవసరమైన శిక్షణ ఉపాధ్యాయు లకు అందించామని అన్నారు. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులలో ప్రహారీ గోడ, టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మన పూర్వీకులు మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, గొప్ప స్థాయికి ఎదిగారని తెలిపారు. గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 96 శాతం ఉత్తీర్ణత ఉంటే, ప్రైవేట్ పాఠశాలల్లో ఆ సంఖ్య కేవలం 91 శాతం అని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఫలితాలను ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్నాయని కలెక్టర్ గుర్తుచేశారు. మన దగ్గర నాణ్యమైన, అనుభవం కల్గిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఒక సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి పిల్లలను పంపాలని, వారిలో స్పష్టమైన మార్పు కనిపించని పక్షంలో మళ్ళీ ప్రైవేట్ కు పంపాలని, ఒకసారి ప్రభుత్వ పాఠశాలలకు అవకాశం కల్పించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కల్లూరు మండలంలో మూతబడి పునః ప్రారంభించుకున్న పాయాపూర్, లక్ష్మీపురం, ఓబుల్ రావు బంజారా పాఠశాలల రినోవేషన్ కోసం రూ,10 లక్షల రూపాయల చెక్కును కల్లూరు ఆర్డీవోకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిల్లలకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ ను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఎంత మంది విద్యార్థులు అంగన్వాడీ కి వస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. పోషక లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని, పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడి కేంద్రంలో ఉన్న పిల్లల ఎత్తు, బరువు, వయసుకు తగ్గట్టు ఉందో లేదో నిరంతరం చెక్ చేసుకోవాలని, అంగన్వాడీకి కావలసిన సౌకర్యాలకు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, ఎంపీడీఓ., ఎం.ఈ.ఓ. పి. నివేదిత, సి.డి.పి.ఓ. సి.హెచ్. నిర్మలా జ్యోతి, సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్ ఐ.వరలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# మానవాళిని కష్టాల నుండి విముక్తి కలిగించేది 'మార్క్సిజం' మాత్రమే

**-సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు**

**బోనకల్ సూర్య (మేజర్ న్యూస్):**



ప్రపంచ మానవాళిని కష్టాల నుండి విముక్తి కలిగించేది మార్క్ ఇజం మాత్రమేనని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. మండలంలోని చిరునోముల పరిధిలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో బుధవారం జరిగిన సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులకు హాజరై పార్టీ నిర్మాణం- పని పద్ధతులు అనే అంశాన్ని బోధించారు. కార్మిక వర్గ దృక్పథంతో సిపిఎం పనిచేస్తుందని, లేని నిజం సిద్ధాంతంతో సిపిఎం పనిచేస్తుందన్నారు. సిపిఎం శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేయాలన్నారు. గ్రామాల్లోని శాఖలు పార్టీకి గుండెకాయ లాంటివి అన్నారు. క్షేత్రస్థాయిలో వర్గ పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్య ఊహిస్తున్న మధిర నియోజకవర్గంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఆర్థిక మంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క సీతారామ ప్రాజెక్టుకు నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. మధిరను మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని పదే పదే చెప్పే మల్లు భట్టి విక్రమార్క రోడ్లు వేస్తేనే అభివృద్ధి కాదని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తేనే మధిర మోడల్ నియోజకవర్గంగా మారుతుందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. బిజెపి మతతత్వ విధానాలు ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సైనికుల్లా ముందుకు సాగాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఉద్యోగులు, పెన్షనర్ల డిమాండ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఒక్క పరిశ్రమ కూడా ఎందుకు తీసుకురావడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మధిర నియోజకవర్గ వ్యాప్తంగా భవిష్యత్తులో క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం మొదటి డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు తెలిపారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సిపిఎం సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, పాపినేని రామ నరసయ్య, వివిధ మండలాల సిపిఎం కార్యదర్శులు కిలారు సురేష్ రాము సైదులు ప్రభాకర్ పురుషోత్తం మురళి, శాఖల కార్యదర్శులు, సిపిఎం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

**-పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్**

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**



గురుకుల పాఠశాలలో చేరే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్ సూచించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ను బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. గురుకుల పాఠశాల ఆవరణ అంతా కలియ తిరిగారు. అడ్మిషన్ల గురించి ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గురుకులం లోకి వచ్చే సమయం కు అన్ని సిద్దంగా ఉండాలని అన్నారు.

పారిశుద్ధ్యం పట్ల అప్రమతంగా ఉండాలని అన్నారు. శానిటేషన్, వంటలు,కూరగాయల కు సంబంధించిన కమిటీ సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోనూ లో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. గురుకులాలలో ఉంటున్న విద్యార్థులకు ఇంట్లోనే ఉన్నట్లు భావన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీడీవో.ఎం.యర్రయ్య గురుకులాల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఇంటెన్సిఫైడ్ టీబి ముక్తభారత అభియాన్

**కల్లూరు సూర్య రూరల్ న్యూస్ జూన్ 11 :**

మండల పరిధి చెన్నూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చంద్రుపట్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో గల గ్రామపంచాయతీలో వైద్యుల సమక్షంలో ప్రధానమంత్రి ఇంటెన్సిఫైడ్ టీవీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు ఈ కార్యక్రమంలో టిబి నోడల్ అధికారి శ్రీకర్ టీబీ చికిత్స సూపర్వైజర్ వై సురేష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని వనరబుల్ పాపులేషన్ అయినా షుగర్ వ్యాధిగ్రస్తులు బీపీ వ్యాధిగ్రస్తులు మరియు క్యాన్సర్ 60 సంవత్సరాల పైబడిన వ్యక్తులు టీవీకి గతంలో మందులు వాడిన వారు వారి కుటుంబ సభ్యులు అందరిని స్క్రీనింగ్ చేసి లక్షణాలున్న 80 మంది నుండి కల్లె నమూనాలు సేకరించడం జరిగింది అని తెలియజేశారు గ్రామంలో ఎవరైనా దాతలు ఉంటే నిక్షేమిత్రగా ముందుకు వచ్చి టీబీ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలని తద్వారా టిబి



రహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ సదా టిబి ల్యాబ్ సూపర్వైజర్ ఆర్ సంజీవ్ కుమార్ ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు ఐ సి టి సి సిబ్బంది లింక్ వర్కర్ పాల్గొన్నారు.

# కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు మొదటి విడతలో ఎంపికైన వారి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

**-షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు కస్తాల సత్యనారాయణ**

**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**



2025-26 విద్యా సంవత్సరానికి కమీషనర్, షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము, హైదరాబాదు వారి ఆదేశములను అనుసరించి కార్పొరేట్ కళాశాలల ప్రవేశానికి మొదటి విడత క్రింద ఎంపిక అయినవారు సి.జి.జి. /ఇపాస్ నుండి మెసిజ్ (యస్. యం.యస్) వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులు ది.13.06.2025 న ఉదయం 10.30 గంటల నుండి రూమ్ నెం. ఎస్.34, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వి.వి పాలెం, ఖమ్మం నందు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరుగుతుందని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఇ%-%పాస్ నుండి మెసేజ్ (యస్.యం.యస్) వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ క్రింది చూపబడిన ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావాలని కోరారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ అనంతరం అలాట్మెంట్ ఆర్డరు కాపీలు జారీ చేయబడునని తెలిపారు.

**విద్యార్థి వెరిఫికేషన్ సమయంలో సమర్పించవలసిన ధృవపత్రాలు :-**

1. మీ సేవ కేంద్రం ద్వారా జారీ చేయబడిన కుల ధ్రువీకరణ పత్రము.,2. మీ సేవ కేంద్రం ద్వారా జారీ చేయబడిన ఆదాయ ధ్రువీకరణ పత్రము., 3. యస్.యస్.సి మెమో
4. ఆధార్ కార్డు., 5. రేషన్ కార్డు., 6. విద్యార్థి బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ (జాతీయ బ్యాంక్ అకౌంబు), 7. సంక్షేమ వసతి గృహ విద్యార్థి అయినచో వసతి గృహ సంక్షేమాధికారి ధ్రువీకరణ పత్రము (03) సంవత్సరాలు (3వ తరగతి నుండి 10వ తరగతి వరకు), 8. దివ్యాంగులు అయినచో సంబంధించిన ధ్రువీకరణ పత్రము ( సర్టిఫికేట్), 9. గడిచిన ఏడు సంవత్సరాలు స్టడీ సర్టిఫికెట్స్ (4వ తరగతి నుండి 10వ తరగతి), 10. ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో. పైన తెలిపిన సర్టిఫికెట్స్ అన్ని ఒక జిరాక్స్ సెట్ తీసుకుని రావాలని కోరారు.

# కట్ల రంగారావుకు అభినందనల వెల్లువ

**వైరా టౌన్(సూర్య న్యూస్):-జూన్ 11**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వైరాకు చెందిన కట్ల రంగారావుకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆయన్ను కలిసేందుకు ప్రజా ప్రతినిధులు,విద్యార్థి సంఘాలు,వ్యాపారస్తులు, మిషన్ భగీరథ వర్కర్స్, నాయి బ్రాహ్మణ సంఘం,పార్టీ నాయకులు తదితరులు తరలివస్తుండడంతో ఆయన ఇల్లు సందడిగా మారిపోయింది. కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా అధిష్టానం కట్ల రంగారావు నియమించడం పట్ల ఆయన నివాసంలో కలిసిన వారందరూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్ రెడ్డి, రాచ బంటి నాగరాజు, వాడపల్లి రామారావు, దొంత బోయి న కిషోర్, ఎదునూరి శీను (బుజ్జి), తోటకూర నాగరాజు, మూడుముంతల గోపి, చీమల రాకేష్, గోళ్ళ కొండ, పండు తదితరులు ఉన్నారు.




# పెంద్ర.పెంటయ్య మృతదేహానికి నివాళులు

**-అర్పించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్.**

**ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ :**



బుధవారం ఎదులాపురం మున్సిపాలిటీ, పరిధిలోని మద్దులపల్లీ ,ఇందిరమ్మ కాలనీ కి చెందిన పెంద్ర. పెంటయ్య(70), బుధవారం అనారోగ్య కారణాలతో వారి స్వగృహం నందు మృతిచెందారు. కాగా విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా.సురేష్ నాయక్ వారి స్వగృహం మద్దులపల్లీ, ఇందిరమ్మ కాలనీ నందు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం తన సొంత నిధులు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి అలాగే వారి ఆత్మకి శాంతి కలగాలని భగవంతునికి ప్రార్థించారు. అలాగే వారి కుటుంబాన్నీ ఓదార్చి కాంగ్రెస్ పార్టీ ఎల్ల వేళల అండగా ఉంటుందని భరోసా ఇచ్చి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా వారితో పాటు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు పెంద్ర. అంజయ్య,ఎదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కళ్లెం. శేష్ రెడ్డి,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలి





ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్ప

గుండాల, సూర్య (మేజర్ న్యూస్) – ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ఆట పాటలతో పాటు చక్కని విద్యను అందించడం జరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్ప సూచించారు. అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ -2 కేంద్రంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్యం కోసం ఉదయం గుడ్డు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ను ఉచితంగా అందిస్తామని అన్నారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా రంగురంగుల బొమ్మలతో కూడిన పుస్తకాల ద్వారా విద్య బోధన అందిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జవ్వాజి పద్మ, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్త జయ, విద్యార్థులు, చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఆన్లైన్ ప్రక్రియపై అవగాహన - ఏఈ గాడ్విన్



జూలూరుపాడు, సూర్య (మేజర్న్యూస్)– మండలంలోని అనంతారం గ్రామంలో మండల హౌసింగ్ ఏఈ గాడ్విన్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శు లతో సమావేశమయ్యారు. ఇందిరమ్మ ఇండ్లను ఆన్లైన్ యాప్లో ఎలా అప్లోడ్ చేయాలో కార్యదర్శులకు వివరించారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇంటి నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని వివరించారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారి సమాచారాన్ని ఆన్లైన్లో అప్లోడ్ చేయడం, నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల ఫోటోలను యాప్లో నమోదు చేయడం వంటి పలు అంశాలపై ఏఈ గాడ్విన్ తగు సూచనలు చేశారు. పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసిన అనంతారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పంచాయితీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు .

# కొప్పుల మురళి భౌతిక ఖాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఇల్లందు సూర్య(మేజర్ న్యూస్)– ఇల్లందు పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇల సంజయ్ నగర్కు చెందిన కొప్పుల వెంకటేశ్వరరావు ప్రథమ పుత్రుడు కొప్పుల మురళి అనారోగ్యానికి గురై మృతి చెందారు. సహచరుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య మృతుడు మురళి ఇంటికి వచ్చి ఆయన భౌతిక కాయానికి ఘనంగా నివాళు లర్పించారు. మృతుని తండ్రి కొప్పుల వెంకటేశ్వరరావును వారి బంధువులను ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి సైదులు, ఇల్లందు మాజీ వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్ కుమార్, మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు ఘాజీ, రాము, సిఐ సురేష్, కాస్మోటిక్ వెంకటేశ్వర్లు, అరకాల రాజయ్య,తుపాకుల రాజేశ్వరరావు, ఆర్ వెంకటేశ్వర్లు,ఇల్లందు మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కూడా బాబురావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయిశెట్టి పోశం, తమిదల బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

# చెక్కు బౌన్స్ కేసులో ముద్దాయికి 1 సం జైలు శిక్ష..

ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్) – ఇల్లందు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నందు చెక్కు బౌన్స్ కేసులో ముద్దాయికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించిన విషయాన్ని మెజిస్ట్రేట్ కీర్తి చంద్రిక రెడ్డి వెల్లడించారు.ఇల్లందు పట్టణానికి చెందిన కొమురవెల్లి సాహితీ రాణి డబ్ల్యు /ఆఫ్ సురేష్ ఇల్లందు నివాసి వద్ద రూ 4 లక్షలు అప్పుగా తీసుకున్న కొండూరి ఉదయభాస్కర్ ఆ బాకీనీ చెల్లించే నిమిత్తంలో తను రూ 4 లక్షలకి సంబంధించి తను చెక్కు రాసి ఇవ్వడం జరిగింది. తాను ఇచ్చిన చెక్కును బ్యాంకులో చెల్లించుకొనుటకు కొమురవెల్లి సాహితీ రాణి వెళ్లగా ఆ చెక్కు బౌన్స్ అయినది. ఈ విషయంలో కొమురవెల్లి సాహితీ రాణి తనకు జరిగిన అన్యాయాన్ని ఇల్లందు కోర్టులో తన లాయర్ అయినటువంటి తాడూరి మహేష్ ద్వారా చెక్ బౌన్స్ కేసును కొండూరు ఉదయభాస్కరరావు పైన కేసు వేయగా ఈ కేసు నందు ఎల్లందు కోర్టు లో తగిన సాక్షాలను విచారించి ఈరోజు ముద్దాయి అయినా కొండూరి ఉదయభాస్కర్ నాకు ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు రూ 4లక్షలు చెల్లించవలసిందిగా తెలియజేస్తూతను చేసిన నిర్లక్ష్యానికి తక్షణమే రూ 10వేలు ఫైన్ కూడా విధిస్తూ తన అమూల్యమైన తీర్పును వెల్లడించారు. ఈ కేసులో ముద్దాయి తరుపున న్యాయవాదులుగా కే నాగేశ్వరరావు, కె ఉమామహేశ్వరరావులు వాదించారు.

# ఈ నెల 21, 22న టియుసిఐ మహాసభలు

## టియుసిఐ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)– ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర ప్రథమ మహాసభలను నిజామాబాదులో ఈనెల 21, 22న జరుగుతున్నాయి. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కొత్తగూడెంలో స్థానిక రైటర్ బస్తీలో కార్మికు లతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి పెద్ద బోయిన సతీష్, ఉపాధ్యక్షులు వై గోపాలరావు లు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక పక్షాన నిలబడినటువంటి టియుసిఐ తెలంగాణ రాష్ట్రంలో ఆవిర్భవించి రాష్ట్రంలో కార్మికుల అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్నదన్నారు. సింగరేణి కెజీబీవీ గ్రామపంచాయతీ మున్సిపల్ మధ్యాహ్న భోజన పథకం హొటల్స్ ఫ్యాక్టరీలు, బీడీ పరిశ్రమ ఆటో అండ్ మోటార్ గోదాం మధ్యాహ్న భోజనం ఇలా అనేక రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతుందన్నారు. ఈ సందర్భంలోనే గత ఉద్యమాన్ని సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకొనుటకు టియుసిఐ మొదటి రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నదని తెలిపారు. కావున జిల్లాలో ఉన్నటువంటి అన్ని విభాగాల కార్మిక వర్గం అసంఘటిత సంఘటిత రంగ కార్మికులు ఈ రాష్ట్ర మహాసభలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని కార్మిక హక్కుల అమలుకై పోరాడాలని పోరాటాల ద్వారానే కార్మిక హక్కుల అమలు అవుతాయని ఈ సందర్భంగా వారు అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పోరాడే సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుకోడు గా విభజించి కార్మికులను కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం కొనసాగుతుందని 12 గంటల పని విధానం తీసుకొచ్చేందుకు కుటీల ప్రయత్నాలు ప్రారంభించారని వీటిని తిప్పుకొట్టుటకు బలమైన ఉద్యమాలు నిర్వహించుటకు టియుసిఐ సన్నద్ధం అవుతుందని ఈ మహాసభల్లో భవిష్యత్తు ఉద్యమ కర్తవ్యాలను తీసుకొని ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కార్మికులు వ.సంధ్య. గంగా. కృష్ణ. భగవాన్. పోశం. శిరీష. భాగ్యలక్ష్మి.సునీత. జవహర్లాల్. శ్రీను. పూర్ణ. విజయ. తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పరిశుభ్రతే విద్యార్థులకు ఆరోగ్యం



కరకగూడెం, సూర్య (మేజర్ న్యూస్) – మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి "స్వచ్ఛ మిత్ర" లకు శిక్షణ కార్యక్రమం కోర్స్ డైరెక్టర్ జి మంజుల అధ్యక్షతన సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మండలంలోని 25 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు,3 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల "స్వచ్ఛ మిత్ర" లకు శిక్షణ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరకగూడెంలో నిర్వహించారు. స్వచ్ఛ మిత్ర లకు పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, మొక్కలు పెంపకం అలాగే టాయిలెట్ పరిశుభ్రంగా ఉంచడం వారి విధులలో భాగంగా పాఠశాలను ప్రత్యేక శ్రద్ధతో పాఠశాల ఆవరణం లో ఖాళీ స్థలాలను కిచెన్ గార్డెన్గా పెంపొందించేలా ఉండాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ గా జె వెంకటేశ్వర్లు, బి. బావ సింగ్ కె. సూర్యనారాయణ, మండల సిబ్బంది గురువయ్య ,జయబాబు విష్ణుమూర్తి పాల్గొన్నారు.

# నాచారంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం విజయవంతం





దమ్మపేట,సూర్య (మేజర్ న్యూస్)– వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట వారి ఆధ్వర్యంలో నాచారం గ్రామపంచాయతీ వద్ద రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాచారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు రాఘవరావు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులతో శాస్త్రవేత్తలను మమేకం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టటం నిజంగా అభినందనీయం అన్నారు. ముందు ముందు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టి రైతులకు మేలు చేకూర్చేలా చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విత్తనాలు, రసాయనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రసీదులను భద్రపరచుకొని, ఏదైనా సమస్యలు వచ్చినట్లయితే వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే రైతులు నష్టపోకుండా ఉంటారు అని తెలియపరిచారు. అదేవిధంగా సాగునీరు వినియోగంలో పాటించాల్సినటువంటి శాస్త్రీయ మెలకువలను రైతులకు వివరించారు. అదేవిధంగా పంట మార్పిడి వలన సుస్థిరమైనటువంటి దిగుబడులు సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల, శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాంప్రసాద్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులను సమతుల్యంగా వాడాలి అన్నారు. యూరియాను మరియు ఇతర ఎరువులను తగిన మోతాదులో వాడటం వలన సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక నికర లాభాలు పొందవచ్చు అన్నారు. రైతులు పంట మార్పిడి చేయటం మరియు పంట అవశేషాలను భూమిలో కలియదుడటం వలన భూసారం పెరుగుతుంది అన్నారు. రైతులు పంటల సాగులో పాటించవలసిన శాస్త్రీయ మెలకువలు గురించి వివరించారు.అనంతరం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. రమేష్ భూసార పరీక్షలకు మట్టి నమూనాను ఏ విధంగా సేకరించాలి, ఏ పోషకాలను పంటలకు ఏం మోతాదులో ఏ విధంగా వాడాలి తెలిపారు.అదే విధంగా పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం యొక్క ఆవశ్యకతను రైతు లకు వివరించారు. అదేవిధంగా పంట మార్పిడి వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.తరువాత ఉద్యాన విస్తరణ అధికారి ఈశ్వర్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో రైతులు పాటించాల్సినటువంటి మెలకువలు, ఉద్యాన శాఖ రైతులకు అందిస్తున్నటువంటి రాయితీలను గురించి వివరించారు. అదేవిధంగా ఆయిల్ ఫామ్ సాగులో రైతులు పాటించాల్సినటువంటి మేలైన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తో పాటు నాచారం రైతులు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ భారతితో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

### రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల

**పాల్వంచ,సూర్య(మేజర్ న్యూస్) -** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా చేపట్టిన భూభారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండలం పరిధిలోని పునుకుల పంచాయితీ కార్యాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కొత్వాల పాల్గొని దరఖాస్తు విధానాన్ని పరిశీలించారు. భూభారతి చట్టం ఆవశ్యకతను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ధరణి యాప్ తో రైతుల భూ సమస్యలు పేరుకు పోయాయని, దాని పరిష్కారానికే భూభారతి ఏర్పడిందన్నారు. రైతులు తమ భూ సమస్యలను రైతు సదస్సులలో అధికారులకు వివరించాలన్నారు. ఈనెల 20 తేది వరకు నిర్వించే రైతు సదస్సులను రైతులు,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని



కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఎం వెంకటేశ్వర్లు, రూరల్ ఆర్ఐ సిహెచ్ నలిన్ కుమార్, సర్వేయర్ గౌతం, శ్రావణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, కందుకూరి రాము ఉండేటి శాంతి వర్ధన్, అలెక్స్ తదుతూరి, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న సింగరేణి అధికారులు

**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)-** కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని రైతు బజార్ ఏరియాలో సింగరేణి స్థలంలో అనుమతి లేకుండా వ్యాపారస్తులు కూరగాయల దుకాణాల కోసం అక్రమంగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా జేసీబీ తో త్రవ్వకాలు మొదలుపెట్టగా ఎస్టేట్, సెక్యూరిటీ సిబ్బంధి అడ్డుకొన్నారు. ఈ సంధర్భంగా ఎస్టేట్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంధి సంబంచిత కూరగాయల వ్యాపారస్తులతో సింగరేణి స్థలములలో ఎస్టేట్ అధికారుల అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, అలా కాకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు కట్టినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆ నిర్మాణాలను కూడా కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్టేట్స్ అధికారులు మోహన్




రావు, సర్వేశ్, శ్రీనివాస్, భువనేశ్వరి, ఎస్,పిసి జూనియర్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి, జమేదార్ భాస్కర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిఎం వెల్ఫేర్, సిపిఆర్ఎంఎస్‌గా భాధ్యతలు స్వీకరించిన అధికారులు






**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)-** సింగరేణి కంపెనీ వ్యాప్తంగా వివిధ ఏరియాలలో వివిధ హెూదాలలో పనిచేసి, డిజిఎం పర్సనల్ (వెల్ఫేర్) గా నియమితులైన కేసా నారాయణ రావు బుధవారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది వారికి సాదరంగా స్వాగతం పలికారు. అదే విధంగా కొత్తగూడెం ఏరియా డిజిఎం(పర్సనల్) గా పనిచేస్తూ కార్పొరేట్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిపిఆర్ఎంఎస్ సెల్ కు బదిలీపై వచ్చిన బి.శివ కేశవ రావు పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు. సిపిఆర్ఎంఎస్ సెల్ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అదే విధంగా వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నందు ఏజిఎం(పర్సనల్) గా పనిచేస్తు కార్పొరేట్ పిఎం వింగ్ కు బదిలీ అయిన ఏజిఎం (పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్కి జిఎం(పర్సనల్) వెల్ఫేర్,సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, కార్పొరేట్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు ఘనముగా సన్మానించి, వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కు వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పిఎం వింగ్ నందు పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఏజిఎం (పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణ రావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, డివై.పిఎం లు కే.శివ కుమార్, జి.కే.కిరణ్ కుమార్, మేనేజ్మెంట్ ట్రైనీ(పర్సనల్) కే.ఉదయ్ కుమార్, కార్పొరేట్ వెల్ఫేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమ్మగుడిలో వైభవంగా "చండీహూమం"




**పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)-** ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలంలోని కేశవాపురం-జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) లో "చండీహూమం" దేవస్థాన ఆవరణలో గల యాగశాలలో బుధవారం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో, వేదమంత్రాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహమును దేవాలయం నుండి యాగశాలకు తీసుకొనివచ్చి, మండపారాధన, గణపతి పూజలు జరిపి అనంతరం చండీహూమం, చివరన పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ హెూమంలో 22 మంది దంపతులు ఒక్కొక్కరు రూ. 2516/- రుసుము చెల్లించి చండీహూమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు, వేదపండితులు చండీహూమంలో పాల్గొన్న వారికి ఆశీర్వచనంతో పాటు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. అనంతరం చండీహూమం చేసుకున్న భక్తులకు అమ్మవారి అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి, పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు పెండ్లి రామిరెడ్డి, చెవుగాని పాపారావు, చెరుకూరి శేఖర్ బాబు,శనిగారపు శ్రీనివాసరావు,దుగ్గిరాల సుధాకర్ , సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిని పరామర్శించిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం సూర్య ప్రతినిధి, జూన్ 11 :** ప్రమాదవశాత్తూ జారిపడి గాయపడి యశోద ఆసుపత్రి (సోమాజిగూడ)లో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎంపీ మన్నే శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా పల్లా ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎంపీ నామ అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. పల్లాను పరామర్శించిన వారిలో ఏనుగుల రాకేష్‌రెడ్డి, తాళ్లూరి జీవన్‌కుమార్, మాజీ జడ్పీటీసీలు ఇంటూరి శేఖర్, వరప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు మల్లిడి వెంకన్న తదితరులు ఉన్నారు.